క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, ఆంజనేయ స్వామి దేవాలయం, హంటర్ రోడ్డు, టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, హనుమకొండ జిల్లా బస్ స్టేషన్, పద్మాక్షి కాలనీ, ఎస్ఆర్ కళాశాల, జయ నర్సింగ్ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, వివేకానంద, సాయి గణేష్ కాలనీ, సొసైటీ కాలనీ, సాయిబాబా టెంపుల్, ఎరుకల వాడ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్



కాజీపేట అర్బన్: తెలంగాణ మహేంద్ర మేదరి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌కు చెందిన తోకల లక్ష్మణ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హంటర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో మేదరి సంఘం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా ఇందూరి చెన్నయ్య, యాళమల యాదగిరి, నోముల మహవీర్, వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోరీగల శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

రామన్నపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం గడిచినా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించలేదని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దాంతో పర్యవేక్షణ కరువై అధికారుల్లో తీవ్ర అలసత్వం పెరిగి, విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యా సంవత్సరం పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ తీవ్ర గందరగోళంగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి పాలిసెట్ సీట్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తిచేయించేందుకు కృషిచేయాలని కోరారు.

బావి వద్ద ప్రత్యేక పూజలు



వరంగల్ అర్బన్: కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర, రంగనాథ ఆలయ పరిరక్షణ సొసైటీ ఆధ్వర్యంలో బావి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత హాజరు కాగా, అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏట వెంకట్రావు, కమిటీ సభ్యులు మాటేటి అశోక్ కుమార్, గంగుల దయాకర్, మార్గం ఎల్లయ్య, ఆకేన వెంకటేశ్వర్లు, జంగం రాజనర్సు, బోడకుంట్ల వైకుంతం, కోట రాజ్ కుమార్, అర్చకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో అంజన్న



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని దక్షిణ ముఖ అభయాంజనేయ దేవాలయ ఆవరణలో పూసిన కందం బం పుష్పాలతో అంజన్నను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారికి ఆదివారం పంచామృతాలతో పాటు సహస్రధారాలతో నది జలాలతో అభిషేకాలు జరిపించారు. ఇటీవల భక్తులు సమర్పించిన వెండి తొడుగులతో అంజన్నను అలంకరించారు.

కేయూ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆడిటోరియంలో సోమవారం నిర్వహించనున్న స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కత్తెరపెల్లి దామోదర్ పిలుపునిచ్చారు. కేయూలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ జెట్టి రాజేందర్, బాధ్యులు డాక్టర్ పాలకుల కొమురయ్య, డాక్టర్ అరూరి రంజిత్, కందికొండ తిరుపతి, రమేష్, సురేష్, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.

డుగ్ డుగ్ బండి.. మోగితే కుదరదండి!

కాజీపేట: కొందరు యువకులు తమ సరదా కోసం .. ద్విచక్ర వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చి, అధిక శబ్దం వచ్చే వాటిని వినియోగిస్తున్నారు. అందుకోసం రూ.వేలు ఖర్చు చేస్తూ, స్థానిక మెకానిక్‌ల వద్ద మార్పిడి చేయిస్తూ రహదారులపై రెచ్చిపోతున్నారు. కిలోమీటర్ల దూరం వరకు వినిపిస్తూ భరించలేనంతగా వచ్చే శబ్దంతో తోటి వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. యువతులను ఆట పట్టించేందుకు పోకిరీలకిది ఓ అస్త్రం అవుతోంది. రాత్రి వేళల్లో నివాసాల మధ్య రేసింగ్‌లు నిర్వహిస్తున్న ఘటనలూ ఉన్నాయి. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ పర్యవేక్షణలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ అధిక శబ్దం చేసే ద్విచక్రవాహనాల సైలెన్సర్లను తొలగించడంతో పాటు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

చట్టప్రకారం ద్విచక్ర వాహనం నుంచి వచ్చే శబ్దం 90 డెసిబుల్స్ తీవ్రత వస్తుండగా.. బుల్లెట్లు, స్పోర్ట్స్ బైక్‌ల్లో ఇది 500కు చేరుతోందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇటీవల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ఓ ద్విచక్ర వాహనం ఖరీదు రూ.25 లక్షలు కాగా దానికి రూ.76 వేలు వెచ్చించి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్‌ను అమర్చినట్లు తేలింది.



కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సైలెన్సర్ మార్చుకొని వెళ్తున్న వాహనదారుడు

అధికంగా నమోదవుతున్న కేసులు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో వెయ్యికి పైగా ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. సుమారు 1200లకు పైగా వాహనాల సైలెన్సర్లను తొలగించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు రూ.వెయ్యి నుంచి రూ.12 వందలు వరకు జరిమానాలు సైతం విధిస్తున్నారు. ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలోనే సైలెన్సర్లను మెకానిక్‌లతో తొలగించి మామూలువి బిగింపజేస్తుండడం గమనార్హం. ఈ విషయంలో పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా సైలెన్సర్లను తొలగించి పంపిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా అక్కడక్కడ అలాంటి బండ్లు తిరుగుతున్నాయి.



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

కఠినంగా వ్యవహరిస్తాం..



తీవ్రమైన శబ్దాలతో వినికిడి లోపాలు, పొగతో కాలుష్య సమస్యలు వస్తాయి. మార్పిడి చేసిన సైలెన్సర్లతో కూడిన వాహనాలతో కొంతమంది ఆకతాయిలు న్యూసెన్స్ సృష్టిస్తున్నారు. వారిని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరిస్తాం. ఈ విషయంలో ఎలాంటి పైరవీలకు తావులేదు.

– వెంకన్న, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కాజీపేట

భక్తిశ్రద్ధలతో మొహర్రం పర్వదినం

- భారీగా పీరీల ప్రదర్శన
- మొక్కులు సమర్పించుకున్న భక్తులు

హసన్‌పర్తి: మొహర్రం పర్వదినాన్ని ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పీరీల ఊరేగింపు వైభవంగా జరిగింది. పూర్వకాలం నుంచి పీరీల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన పీరీలను ఆదివారం సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఎదురొచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం స్థానిక చెరువుల్లో పీరీలను నిమజ్జనం చేశారు. పీరీల నిమజ్జనం అనంతరం భక్తి పరమైన గీతాలు ఆలపిస్తూ తిరిగి ఆశుర్‌ఖానాకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు షర్బత్ తయారు చేసి పంపిణీ చేశారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉపవాస దీక్షలు ఆచరించారు. షియా తెగకు చెందిన వారు మొహర్రం జరుపుకుంటారు. అయితే, సున్నీ తెగకు చెందిన వారు కూడా ఈ పండగను గౌరవంగా ఆచరిస్తారు. ముస్లింలతో కలిసి హిందువులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు.



పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

దేశం కోసం పదవులు త్యాగం



శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సంతోష్‌రెడ్డి, నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి

హన్మకొండ: దేశం కోసం పదవులను త్యాగం చేసిన జాతీయవాది, జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. తొలుత శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఏక్ దేశ్ మే దో నిశాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేంగే, నహీ చలేంగే..' అంటూ జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు కోసం పోరాడుతూ అసువులు బాసిన త్యాగశీలి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని గుర్తుచేశారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూ కశ్మీర్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తి తొలగించి సమైక్య భారత్ సాధించి ఆయన కలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చి అసలైన నివాళి అర్పించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ సత్యనారాయణ రావు, కందగట్ల సత్యనారాయణ, నాను నాయక్, నాంపల్లి శ్రీనివాస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని బంజారా కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. అర్హుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలని, పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలని సూచించారు. అర్హులు ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించొద్దన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక విపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్ యాదవ్, నాయకులు సుగుణాకర్ రెడ్డి, బాలు నాయక్, రాములు, దేవేందర్ రెడ్డి, మోహన్ నాయక్, వీరు, సాయి పాల్గొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

కాజీపేట రూరల్: కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో భారతీయ రైల్వేలో కాజీపేట ఐకాన్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, పి.రమేష్, నమిండ్ల మనోహర్, టోని, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా అనంతసాగర్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వరంగల్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని కొంగల హాసినికి ఓ దాత సహకారంతో విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక చేయూతనందించింది. అమెరికాలో ఉంటున్న కొండపెల్లి దీప్తి అందజేసిన రూ.లక్షా 7వేల విలువైన చెక్కును విద్యార్థికి విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్, ఒయాసిస్ ఆశ్రమ నిర్వాహకుడు ఒద్దిరాజు ప్రకాశ్ అందించారు. ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం జరిగిన సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ విద్యా ఫౌండేషన్ విన్నపంతో హాసినిని దీప్తి దత్తత తీసుకొని ప్రతీ ఏడాది కళాశాల ఫీజు చెల్లిస్తూ విద్యార్థి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ గౌరవ సలహాదారు గురిజాల తిరుపతిరెడ్డి, బాధ్యులు వెల్దండి లీల, నర్సింగరావు, వైద్యులు వాణిరాణి, కడుదల సోమన్న, ఉదయ్, కార్తీకరాజు, కాంచనపెల్లి అనిత, మహ్మద్ రఫీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మహేందర్, తదితరులు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



బట్టలబజార్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

మడికొండ: తొలి ఏకాదశి సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణధికారి కే.శేషుభారతి, ఆలయ అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, మణిశర్మ, భక్తులు సురేష్, నర్సింహ, వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

వరంగల్ చౌరస్తా: తొలి ఏకాదశి సందర్భంగా రామన్నపేట బట్టల బజార్‌లోని బాలానగర వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చనలు, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. సుగంధ ద్రవ్యాలు, పలు పండ్ల రసాలతో అభిషేకం చేశారు.

భద్రకాళి మండలి సభ్యుడికి సన్మానం



ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో భద్రకాళి అమ్మవారి ధర్మకర్త మండలి సభ్యుడు పాలడుగుల ఆంజనేయులును ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కడిపికొండలోని సంఘం భవనంలో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, మొక్కులు నాటారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వాయిలాల తిరుపతి, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కోశాధికారి నార్లగిరి తిరుపతయ్య, గౌరవ అధ్యక్షుడు నార్లగిరి సారయ్య, పాండ్యాల చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్



అంత్యక్రియల్లో కార్పొరేటర్ ఫుర్కాన్

వరంగల్ చౌరస్తా: మృతి చెందిన చెందిన, ఎవరూ లేని ఓ మహిళకు కార్పొరేటర్ దగ్గరుండి అంత్యక్రియలు జరిపించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ ఎల్బీనగర్ 21వ డివిజన్‌కు చెందిన మాటేటి లక్ష్మి మృతి చెందారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులెవరూ లేరు. దాంతో మరో సామాజిక వర్గానికి చెందిన స్థానిక కార్పొరేటర్ ఎండీ.ఫుర్కాన్ అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యుడిలా దగ్గరుండి హిందూ సంప్రదాయం ప్రకారం బీసీ హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

స్ఫూర్తి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ



నివాళి అర్పిస్తున్న సంగని మల్లేశ్వర్, తదితరులు

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: గొప్ప స్ఫూర్తి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆడిటోరియం సమీపంలో దూరవిద్యా కేంద్రం ఆవరణలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వీసీతో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్, అధ్యాపకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజు, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హన్మకొండ: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని తుషార డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల 2002 – 2005వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమేష్, ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు నరేష్, వరుణ్, అంజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు జీఓ రద్దు చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు



సమావేశమైన వివిధ సంఘాల బాధ్యులు

వరంగల్ చౌరస్తా: పనిగంటల పరిమితిని 8 గంటల నుంచి 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం కోరుతూ ఏనుమాముల, కాశిబుగ్గ, గిర్మాజీపేట, వరంగల్ చౌరస్తా, ఆర్ఎన్‌టీ, జేపీఎన్, స్టేషన్ రోడ్డు, బీటు బజార్‌లతో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.బషీర్ మహమ్మద్ పాల్గొన్నారు.

నయీంనగర్: ఈనెల 9న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ హనుమకొండ నయీంనగర్ షాపింగ్ మాళ్ల యజమాన్యాలకు ఆదివారం సమ్మె నోటీసులు ఇచ్చారు. సీఐటీయూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, రజిత పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన తెలంగాణ, కాకతీయ, తాడు ఆటో యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం జరిగింది.

సమ్మెకు సీపీఎం మద్దతు

ఖిలా వరంగల్: ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్న పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య తెలిపారు. పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉర్సుగుట్ట జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల అధ్యక్షతన సమావేశం జరిగింది.

జంతువులకు టీకాలు తప్పనిసరి



పెంపుడు జంతువుకు టీకా వేస్తున్న పశు వైద్యులు

ఖిలా వరంగల్: పాడి పశువులు, పెంపుడు జంతువులకు కాలానుగుణంగా ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అంబిక సూచించారు. పీవీ నరసింహరావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మామునూరు వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లోని వెటర్నరీ కళాశాలలో వరల్డ్ జూనోసిస్ డేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 300కుపైగా పెంపుడు జంతువులకు యాంటీరేబిస్ టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఇఫ్తికర్ అహ్మద్, జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు రాజశ్రీ, శశాంక్, యశస్విని, నమ్రత, అరవింద్, అనూష, వెటర్నరీ విద్యార్థులు, వివిధ డ్రగ్స్ కంపెనీల సభ్యుల పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

హసన్‌పర్తి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్ష పదవికి తన పేరును పరిశీలించాలని కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, నాయకులు నాగేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి ప్రణయ్‌భాస్కర్‌కు నివాళి



ప్రణయ్‌భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు



బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, నాయకులు

చిన్న వయస్సులోనే మంత్రి పదవి చేపట్టిన దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్ధంతిని వడ్డేపల్లిలో దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన తనయుడు, 60వ డివిజన్ కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్

సొంత ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత

హసన్‌పర్తి: 55వ డివిజన్ కోమటిపల్లిలోని చర్చిలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత ఆర్థిక చేయూతనందించారు. ఈ మేరకు మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆమె ఆదివారం ప్రారంభించారు. చర్చిలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక క్రైస్తవులు కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దాంతో స్పందించిన కార్పొరేటర్ రజిత.. సుమారు రూ.1.5 లక్షల సొంత ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు.

ఆ రోజులు.. అలనాటి జ్ఞాపకాలు



సమ్మేళనంలో మేయర్ సుధారాణి, తదితరులు

వరంగల్ చౌరస్తా: నాలుగు దశాబ్దాల నాటి వరంగల్ ప్రభుత్వ కృష్ణా మహిళా జూనియర్ కళాశాల ఇంటర్ స్నేహితురాళ్లతో సరదా కబుర్లు.. ఆ రోజులు.. అలనాటి జ్ఞాపకాలను నగర మేయర్ గుండు సుధారాణి గుర్తు చేసుకున్నారు. 42 ఏళ్ల తర్వాత కళాశాల విద్యార్థినులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థినులు తరలివచ్చి గత స్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు.